మద్యం దుకాణాలకు జోరుగా దరఖాస్తులు

» ఎక్సైజ్ జిల్లా అధికారి ఎం.ఎ.రజాక్

భైంసా,అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కోసం జోరుగా దరఖాస్తులు వస్తున్నాయి. జిల్లాలోని 47 వైన్స్ షాపుల కోసం సోమవారం వరకు 30 దరఖాస్తులు వచ్చాయని, మంగళవారం ఒకేరోజే 10 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజర్వేషన్ల వివరాలతో పాటు దుకాణాల వారీగా గత రెండేళ్లకు సంబంధించిన అమ్మకాల వివరాలు, ఇతర సమాచారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయం నుంచి పొందవచ్చునని తెలిపారు. వాట్సాప్ ద్వారా సైతం పూర్తి సమాచారం పొందేందుకు వీలుందని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు అన్ని పనిదినాలలో కలెక్టర్ కార్యాలయంలోని రెండోఅంతస్తులోగల జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ప్రతీ దరఖాస్తుకు రూ.3లక్షల చాలన్ లేదా డీడీ తప్పనిసరని వెల్లడించారు. మద్యం దుకాణాల దరఖాస్తుల కోసం జిల్లా ఎక్సైజ్ అధికారి 8712658774, భైంసా ఇన్‌స్పెక్టర్ 8712658790, నిర్మల్ ఇన్స్‌పెక్టర్ 8712658791, భైంసా సబ్ ఇన్స్‌పెక్టర్ 8121317191 సెల్ నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఏరియాలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు శరత్ మహల్, మున్సిపల్ ఆఫీస్, కోర్టు ఏరియాలో విద్యుత్ సరఫరాలో ఉదయం 8 నుంచి 10:30 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రియదర్శిని కాలనీలో విరిగిన, ఎత్తు తక్కువ ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయుటకు ప్రియదర్శిని నగర్‌లోని మేరు భవనం, మజీద్, మున్వార్ డెంటల్ హాస్పిటల్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



బాసర గోదావరి వద్ద పుష్కర ఘాట్లు (ఫైల్)

గోదావరి పుష్కరాలకు మొదలైన ఏర్పాట్లు

గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంతో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ, పర్యాటక శాఖలు ఈ దిశగా దృష్టి కేంద్రీకరించి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఆయా శాఖలకు సంబంధించిన ఉన్నతాధికారుల నుంచి నిర్మల్ జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో అధికారులు జిల్లాలోని మొత్తం గోదావరి పరివాహక ప్రాంతంలో క్షేత్రస్థాయి సర్వేను మొదలుపెట్టనున్నారు.

» పుష్కర ఘాట్ల నిర్మాణాలకు రూపొందుతున్న ప్రతిపాదనలు
» బాసర వద్ద ఏర్పాట్లకు రంగం సిద్ధం
» సరస్వతీ ఆలయ అభివృద్ధికి కసరత్తు
» ఉమ్మడి కార్యాచరణకు శ్రీకారం

నిర్మల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి గోదావరి నది జిల్లాలోని బాసర వద్ద ఇక్కడి సరిహద్దులను దాటుతోంది. ఇక్కడి నుంచి ప్రవహించే గోదావరి నది కడెం, చిన్న బెల్లాల్ మీదుగా కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశిస్తోంది. ఒకేరోజు 2లక్షల మంది గోదావరి నదిలో పుష్కర స్నానాలు ఆచరించేలా ఏర్పాట్లు చేపట్టాలంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగానే అధికార యంత్రాంగం అంతా కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని బాసర వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇక్కడ ప్రస్తుతం ఉన్న పుష్కర ఘాట్‌లతోపాటు అదనంగా పుష్కర ఘాట్‌లను నిర్మించడమే కాకుండా సరస్వతి దేవాలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతున్నారు. ముఖ్యంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశాలున్న కారణంగా పార్కింగ్ ఏరియాను ఇక్కడ ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు పుష్కర ఘాట్‌ల వద్ద కూడా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. బాసరతోపాటు నిర్మల్ జిల్లాలోని ప్రధానమైన సోన్ గోదావరి వద్ద కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయబోతున్నారు. బాసర తరహాలోనే సోన్ గోదావరి నది వద్దకు భక్తులు పుష్కరాల సమయంలో భారీ సంఖ్యలో తరలివస్తారు. దీని కారణంగానే ఇక్కడి పుష్కర ఘాట్లతోపాటు అదనంగా పుష్కర ఘాట్లను నిర్మించడమే కాకుండా అన్నిరకాల మౌలిక సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. లోకేశ్వరం మండలంలోని బ్రహ్మేశ్వర్ పంచగుడి వద్ద కూడా ఏర్పాట్లు చేపట్టనున్నారు. ఇక్కడి బ్రహ్మేశ్వరాలయంలో కూడా పుష్కరాల సమయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తారు. దాదాపు 40 కిలోమీటర్ల మేర గోదావరి పరివాహక ప్రాంతాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలను రూపొందించనున్నారు.

పుష్కర స్నాన ప్రదేశాల గుర్తింపునకు సన్నాహాలు

జిల్లాలో బాసర, సోన్ గోదావరి వద్ద ప్రతి 12 ఏళ్ల కోసారి పుష్కరాలు జరుగుతాయి. బాసరతోపాటు ఓనీ, కౌట, సాలాపూర్‌లలో కూడా గోదావరి నది ప్రవహిస్తోంది. ముథోల్ మండలంలోని అష్ట, బ్రహ్మంగావ్ గోదావరి తీరం వద్ద భక్తులు పుష్కర స్నానాలు ఆచరిస్తారు. ఇక్కడ ప్రస్తుతం ఉన్న పుష్కర ఘాట్‌తోపాటు ఈ ఘాట్‌ను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉంది. అలాగే లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ శివారులో గల బ్రహ్మేశ్వరాలయం, పంచగుడి, వాస్తాపూర్, మోహల, పిప్రి, బామ్ని, గడ్‌చందా, దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి, కంజర్, టెంబుర్ని, ఆర్లీ, కాండ్లి, సోన్ మండల కేంద్రంతో పాటు లక్ష్మణచాంద మండలంలోని పీచర, ధర్మారం, పార్‌పెల్లి, చింతల్‌చందా, మామడ మండలంలోని కమల్‌కోట్, పొన్కల్, ఖానాపూర్ మండలంలోని బాదన్‌కుర్తి, కొత్తపేట, సుర్జాపూర్, బాబాపూర్, దిలావర్‌పూర్‌తో పాటు కడెంలోని లింగాపూర్, చిన్న బెల్లాల్ వరకు గోదావరి నది ప్రవహిస్తోంది. ఇక్కడి నుంచే గోదావరి నది కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. అన్ని ప్రాంతాలలో ఈసారి పుష్కర స్నానాల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉమ్మడి కార్యాచరణకు శ్రీకారం

2027 జూలై 23 నుంచి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ముఖ్యంగా జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేపట్టబోతున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖతో పాటు దేవాదాయ, పర్యాటక శాఖలు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను సంయుక్తంగా చేపట్టబోతున్నాయి. దీంతో పాటు పోలీసు శాఖ అలాగే పంచాయతీ శాఖల సహకారం కూడా తీసుకోనున్నారు. ఇలా అన్ని ప్రభుత్వం శాఖలు సమన్వయంగా గోదావరి పుష్కరాల ఏర్పాట్లతో పాటు పుష్కరాలు పూర్తయ్యే వరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నాయి. సమన్వయ లోపం ఎక్కడ కూడా తలెత్తకుండా అవసరమైతే టెక్నాలజీని కూడా ఉపయోగించుకునే విధంగా పకడ్బందీకార్యాచరణ రూపొందించనున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సూర్యనారాయణ ధన్‌పాల్

బాసరలో శృంగేరి మఠం

» మఠంలో లలిత చంద్రమౌళీశ్వర ఆలయం ప్రతిష్ఠాపన
» ఈనెల 17 నుంచి మూడు రోజులపాటు కార్యక్రమాలు
» హాజరుకానున్న శారదాపీఠాధిపతులు
» ఆలయాలు సంస్కృతికి ఆధారం: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

బాసర, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రంలో శృంగేరి మఠం ప్రారంభం కానుంది. మఠంలో నూతన శ్రీలలితా చంద్రమౌళీశ్వర ఆలయ ప్రతిష్ఠా కుంభాబిషేక మహోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈనెల 17 నుంచి 3 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి హాజరు కానున్నారు. బాసరలో మంగళవారం నిజామబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్, సూర్యనారాయణగుప్తా, కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలే మన సనాతన సంస్కృతికి మన సంప్రదాయాలే ఆధారమని అన్నారు. జనాభా జానాభా పెరుగుదలకు అనుకూలంగా కొత్త ఆలయాలను ఏర్పాటు చేసే అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో ప్రసిద్ధి గాంచిన గోదావరి తీరంలో గల బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఇలాంటి కొత్త ఆయలాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమని కొనియాడారు. ఈనెల 17నుంచి 19 వరకు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదా పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ జగద్గురు విధుర శేఖర భారతీ మహాస్వామి స్వయంగా విచ్చేసి కుంభాభిషేక మహోత్సవం వేదపాటశాల అంకురార్పణకు శ్రీకారం చుట్టనున్నట్లుగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు చిట్టిమిల్ల హరిప్రసాద్‌గుప్తా, బాసర మాజీ సర్పంచ్ మాజీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డీసీసీ రెసులో కోర్వ నవీన్‌రెడ్డి



సారంగాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్ష రేసులో సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన కోర్వ నవీన్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన కోర్వ నవీన్‌రెడ్డి పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. కోర్వనవీన్ రామకృష్ణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిర్మల్ ప్రాంతంలోని ఆయా గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అనాతికాలంలోమంచి గుర్తింపును పొందారు. అంతేకాకుండా న్యాయవాధి వృత్తిలో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం పదువలు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నందున జిల్లాలో బలమైన మున్నూర్‌కాపు సామాజికవర్గానికి చెందిన నవీన్‌రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. నవీన్‌రెడ్డి స్థానిక ఎన్నికల పోటీకి సైతం సిద్ధపడ్డారు. డీసీసీ అధ్యక్షుడు ఎంపికపై కాంగ్రెస్ దృష్టి సారించింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై నవీన్‌రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు డా.అజయ్ సింగ్

కార్యకర్తల అభిప్రాయాల మేరకే డీసీసీ అధ్యక్షుడి నియామకం

» ఏఐసీసీ పరిశీలకులు డా.అజయ్ సింగ్

భైంసా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే డీసీసీ అధ్యక్షుడి నియామకం ఉంటుందని ఏఐసీసీ పరిశీలకులు డా.అజయ్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం డీసీసీ అధ్యక్షుని ఎన్నిక కోసం ముథోల్ నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయ సేకరణలో భాగంగా భైంసాలోని గౌరీ శంకర్ ఫంక్షన్ హాల్‌లో సంఘటన్ సృజన్ అభియాన్‌కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముథోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి భోస్లే నారాయణ్ రావ్ పాటిల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ ఏఐసీసీ పరిశీలకులు అజయ్ సింగ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు కార్యోన్ముకులై ముందుకు సాగాలన్నారు. బేధాభిప్రాయాలు, వర్గపోరు వీడి ఐక్యతతో పార్టీని బలోపేతం చేసేందుకు కంకణబద్ధులు కావాలన్నారు. రానున్న రోజులన్నీ కాంగ్రెస్‌వేనని వెల్లడించారు. పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త అంకితమవ్వాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డా ప్రతీ కార్యకర్త మంచి రోజులు ఉన్నాయన్నారు. కార్యకర్తల అభిప్రాయం మేరకే డీసీసీ అధ్యక్షుడి నియామకం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. ఇందులో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, మాజీ జడ్పీ ఛైర్మన్ జుట్టు అశోక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే రామరావ్

భైంసా, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలతో వచ్చిన వరదల మూలంగా నియోజకవర్గ పరిధిలో పూర్తిస్థాయిలో దెబ్బతిన్న రోడ్ల పునర్ నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్‌పాటిల్ సంబంధిత విషయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందచేశారు. నియోజకవర్గ పరిధిలోని పలు గిరిజన, దళిత ప్రాంతాల్లో భారీ వర్షాల మూలంగా రోడ్లు కోతకు గురవ్వడం, గుంతల మయమవ్వడం, కొట్టుకపోవడం లాంటి ఘటనలు అధికంగా చోటు చేసుకున్నాయని మంత్రికి వివరించారు. సమస్యల పరిష్కారం కోసం రోడ్ల పునర్‌నిర్మాణం చేపట్టాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయని పేర్కొన్నారు. ఇందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం కోసం గాను నిధులు మంజూరు చేస్తానని తెలిపారని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఇక్కడి విలేకరులకు ఫోన్ ద్వారా మాట్లాడి తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

» కలెక్టర్ అభిలాష అభినవ్



పంటల కొనుగోలుకు సంబంధించి పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి పంట కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటల కొనుగోలు ప్రక్రియపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియను నిర్ణీత సమయానికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తిచేయాలని సూచించారు. కొనుగోళ్లకు సంబంధించి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ కోసం కపాస్ కిసాన్ యాప్ వినియోగించాలని తెలిపారు. రైతులకు ఈ యాప్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. రైతు వేదికల ద్వారా, గ్రామాల్లో ఏవోలు, ఏఈవోలు రైతులకు ఈ యాప్ వినియోగ విధానాన్ని వివరించాలన్నారు. రైతులు పత్తి కొనుగోలు సంబంధిత సేవల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1800-599-5779 లేదా వాట్సాప్‌నెంబర్ 8897281111ను సంప్రదించి సమాచారం పొందవచ్చని వివరించారు. రైతుల పంటకు ఖచ్చితంగా మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తేమ శాతం విషయంలో రైతులు నష్టపోకుండా వారికి పూర్తి వివరాలు ముందుగానే తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. వేబ్రిడ్జీలకు నిర్ణీత గడువులోపే స్టాంపింగ్ చేయించుకోవాలని సూ చించారు. రైతులు పంటలు అమ్మిన వెంటనే వారికి నిర్ణీత గడువులోపు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోళ్లలో కూడా రైతులకు ఎటువంటి ఇబ్బంది లు కలుగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తమ పంటను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించవద్దని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు సంబంధించిన 'కపా స్ కిసాన్' యాప్ గోడప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, మార్కెటింగ్ అధికారి గజానంద్, ఆర్డీవో రత్న కళ్యాణి, మార్క్‌ఫెడ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లు ఉన్నారు.

అమ్మవారి కానుకల లెక్కింపు

బాసర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి హుండీ కానుకలను మంగళవారం ఆలయ అధికారులు లెక్కింపు నిర్వహించారు. హుండీలో రూ. 81,69,099 నగదు, మిశ్రమ బంగారం 91 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, మిశ్రమ వెండి 3కిలోల 500 గ్రాములు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీలు 79 వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయం మొత్తం 83 రోజుల్లో దేవస్థానానికి సమకూరిందని ఆలయ ఈవో అంజనాదేవి తెలిపారు. ఏఈవో సుదర్శన్ గౌడ్, ఆలయ అధికారులు సిబ్బందితో పాటు భక్తులు పాల్గొన్నారు.



హుండి కానుకలను లెక్కిస్తున్న భక్తులు సిబ్బంది

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ఆశావర్కర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి



ఖానాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఖానాపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆశావర్కర్లసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి అన్నారు. ఆశాల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ నిర్మల్ జిల్లా మూడో మహాసభలకు ఆమె సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సురేష్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి మస్కాపూర్ గ్రామంలో గల సీఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం మహాసభ నిర్వహించే ప్రాంగణంలో యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలు కాపాడిన ఆశావర్కర్లను పలు అంతర్జాతీయ సంస్థలు గుర్తించినా కేంద్ర ప్రభుత్వం మాత్రం గౌరవం ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.18వేల వేతనం ఇస్తామని హామీఇచ్చారని, దీన్ని అమలుచేయాలని అడిగిన ఆశాలపై ప్రభుత్వాలు పోలీసులతో నిర్బంధాన్ని ప్రయోగించడం సమంజసం కాదన్నారు. ఆశాలకు రూ. 50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని హామీఇచ్చిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కిషన్ కుమార్, తొడసం శంభు, నాగెల్లి నర్సయ్య, బి.సుజాత, చంద్రకళ, సుగుణ, సులోచన, లక్ష్మీ, సరిత, ఇంద్రమాల, తదితరులున్నారు.

రైతుబీమా మోసంపై దర్యాప్తు

» ఇద్దరు విచారణ అధికారుల నియామకం

నర్సాపూర్(జి),అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సంచలనం సృష్టించిన రైతు బీమా కుంభకోణంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాల వ్యవహారం వెలుగులోకి రావడంతో ప్రస్తుత మండల వ్యవసాయ అధికారి రాంచందర్ నాయక్ కీలక పాత్ర పోషించారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ అభిలాష అభినవ్, ఆర్డీవో రత్న కళ్యాణి (విచారణ అధికారిగా), జిల్లా జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్‌లను విచారణ అధికారులుగా నియమించారు. విచారణలో నిజానిజాలు బయట పడతాయని జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ మంగళవారం స్పష్టం చేశారు. ఈదర్యాప్తులో త్వరలోనే నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

పాఠశాలలో విచారణ

నర్సాపూర్(జి),అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జడ్పీహెచ్ఎస్ నర్సాపూర్(జి) పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులపై విద్యార్థినీలతో దుష్ప్రవర్తన ఆరోపణలపై విచారణ పూర్తయ్యింది. డీఈవో నియమించిన త్రిసభ్య విచారణ అధికారుల బృందం నివేదికను కలెక్టర్‌కు సమర్పించింది. సస్పెన్షన్‌లో ఉన్న మనోహర్‌రెడ్డి, మోహన్ రావులపై వచ్చిన ఆరోపణలపై నివేదికలో ఏముంది.. ఎలాంటి సిఫార్సులు చేశారనేదే జిల్లా విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇది సున్నితమైన అంశం కావడంతో విద్యార్థినుల రక్షణ, భద్రతకు తాము కట్టుబడి ఉంటామని, నివేదిక ఆధారంగా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పాఠశాలల్లో సురక్షితమైన వాతావరణం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ తుది నిర్ణయం త్వరలో వెలువడే అవకాశం ఉంది.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

ముథోల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముథోల్‌కు చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ సిరిగి సాయినాథ్ కుమార్తె సిరిగి సౌమ్య నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందింది. దీంతో సాయినాథ్ మిత్ర బృందం మంగళవారం సౌమ్యను ఘనంగా సన్మానించారు. మిత్రుని కుమార్తె ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి ఎంబీబీఎస్‌లో సీటు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.



బుద్దికొండలో పంటల నమోదును పరిశీలిస్తున్న ఏవో

ప్రతీ రైతు పంట నమోదు చేసుకోవాలి

నేరడిగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ బాధ్యతగా పంట నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసుకున్న రైతులను మాత్రమే అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి అన్నారు. మండలంలోని బుద్ది కొండ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం ప్రకటించే నిర్దిష్ట ధరకు పంటలను అమ్ముకోవచ్చని, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. కౌలు రైతులు, డి.పట్టా, ఆర్ఒఎఫ్ఆర్ పట్టా భూములు కలిగిన రైతులు కూడా పంటల నమోదుకు అర్హులేనని తెలిపారు. ప్రతి రైతూ ఏయే సర్వే నెంబర్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో? ఆ పంటలను గ్రామ రైతు సేవా కేంద్రంలో పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్యామ్, జైపాల్, గజేందర్, అపర్ణ, స్వర్ణలత, సౌజన్య, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో మైనర్‌పై లైంగిక దాడి

● ఫోక్సో కేసు నమోదు.. నకిలీ బాబా అరెస్ట్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాల నెపంతో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నకిలీ బాబాను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మైనర్ బాలిక తరచూ అనారోగ్యానికి గురవ్వడంతో.. తన స్నేహితురాలు తండ్రి అయిన గాదిగూడకు చెందిన నిందితుడు షేక్ కలీం మంత్రాలు, తంత్రాలు తాయిత్తులతో నయం చేస్తానని నమ్మబలికాడు. బాధితురాలితో సహా వారి కుటుంబీకులను ఈనెల 9న నిర్మల్ జిల్లా సోన్ నది సమీపంలోకి తీసుకెళ్లాడు. తిరిగి 11న బాధితురాలి స్వగృహానికి తీసుకువచ్చారు. కాగా ఆదేరోజు రాత్రి నిందితుడు బాధితురాలి ఇంట్లో బస చేసి.. పూర్తిగా నయం కావాలంటే ఈరోజు రాత్రి ఒంటరిగా బాధితురాలితో పూజలు చేయాలని నమ్మబలికి కుటుంబీకులను వేరే గదిలో ఉంచి రాత్రి సమయంలో బాధితురాలిపై లైంగికంగా వేధింపులకు పాల్పడ్డాడు. విషయం కుటుంబీకులకు చెప్తే వారిని చంపేస్తానని బెదిరించినట్లు మరుసటి రోజు ఉదయం బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పారన్నారు. దీంతో కుటుంబీకులు వెంటనే ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రజలు మంత్రాలను, తంత్రాలు, బాబాలని నమ్మవద్దని, ఎలాంటి వైద్య సమస్యలు ఉన్నా నిర్భయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులను సంప్రదించాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

పంట కొనుగోళ్లు చేపట్టాలి : బీఆర్ఎస్

బోథ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట సాగు కింద రైతులు పండించిన సోయాబీన్, మొక్కజొన్న పంట ఇళ్లకు చేరిందని, ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బోథ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. ప్రైవేట్ దళారీలకు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోయే అస్కారం ఉందని పేర్కొన్నారు. ఇందులో కార్యదర్శి ఎలుక రాజు మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు సోలంకి సత్యనారాయణ ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మాజీ డైరెక్టర్ రమణగౌడ్, తదితరులున్నారు.

బుద్ధుడి బోధన మార్గాలను అనుసరిద్దాం

● బౌద్ధ భిక్షువు బుద్ధఘోష్



మాట్లాడుతున్న బుద్ధఘోష్

ఉట్నూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్త మానవాళికి శాంతి సందేశాన్ని ఇచ్చిన భగవాన్ బుద్ధుడి బాటలో ప్రతీఒక్కరు నడవాలని బౌద్ధ భిక్షువులు బుద్దగోశ్, ఆరియా అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్(బి) గ్రామంలోని సాకేత్‌బుద్ద విహార్‌లో 69వ ధమ్మ చక్ర పరివర్తన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచశీల జెండాను ఆవిష్కరించి, బుద్ద వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా బౌద్ద భిక్షువు బుద్ధగోష్ మాట్లాడుతూ సకల జగతికి గౌతమ బుద్దుడు శాంతి, కరుణ, మైత్రి, సోదర భావాన్ని కలిగిన గొప్పధమ్మాన్ని అందించారన్నారు. మనిషి తన జీవితంలో రాగద్వేషాలను విడిచి మానవ మనుగకు అనువైన బౌద్ధ ధర్మాన్ని ఆచరించాలన్నారు. అనంతరం వ్యాస రచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సమాతా సైనిక్ దళ్ జాతీయ కో ఆర్డినేటర్ సునిల్ సారీపుత్త, దక్షిణ బారతదేశ అధ్యక్షుడు వాఘ్మారే దీపక్, అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లె జితేందర్, నర్సాపూర్ గ్రామ అధ్యక్షుడు మిలింద్ వాఘ్మారే, కాంబ్లె భగవాన్, తదితరులున్నారు.

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): స్వేచ్ఛ, సమానత్వం బోధించే బౌద్ధ మతానికి ఆకర్షితులై 1935 అక్టోబర్ 13న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారని భారతీయ బౌద్ధ మహాసభ ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కుమార్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ లోని అంబేద్కర్ చౌక్ వద్ద ధమ్మ చక్ర పరివర్తన దివస్‌ను నిర్వహించారు. పంచశీల జెండా ఆవిష్కరించి, బౌద్ధ వందనం సమర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.



అక్రమంగా తయారు చేస్తున్న ఫర్నిచర్‌ను పట్టుకున్న అధికారులు



ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న జిల్లా అటవీ అధికారి రేవంత్‌చంద్ర

అక్రమ కలపతో తయారు చేసిన ఫర్నిచర్ పట్టివేత

ఉట్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రాంతాలలో అక్రమ కలపతో తయారు చేస్తున్న ఫర్నిచర్‌ను అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలోని అధికారులు మంగళవారం దాడులు చేసి పట్టుకున్నారని జిల్లా అటవి అధికారి రేవంత్‌చంద్ర తెలిపారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్ట ప్రాంతంలో అక్రమంగా ఫర్నిచర్ తయారు చేస్తున్న కరీం, మధులు అక్రమ కలపతో చేస్తున్న ఫర్నిచర్ తయారీ కేంద్రాలపై దాడులు చేయగా సోఫా సెట్లు, కూర్చీలకు సంబంధించిన కలప లభించిందని తెలిపారు. పట్టుకున్న కలప ఫర్నిచర్‌ను అటవీ శాఖ కార్యాలయానికి తరలించగా డీఎఫ్ఓ రేవంత్‌చంద్ర పరిశీలించారు. ఉట్నూర్ కేంద్రంగా అక్రమంగా ఫర్నిచర్ తయారు జరుగుతుంటే ఏమి చేస్తున్నారంటూ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ గోపాల్‌సింగ్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ సునిల్‌ల పై జిల్లా అటవి అధికారి రేవంత్‌చంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఫర్నీచర్ తయారీ దారులకు టింబర్ డిపోలలో కలప అందుబాటులో ఉన్నందున కలప కొనుగోలు చేసి ఫర్నిచర్ తయారు చేయలి.. కానీ అడవులు నుంచి అక్రమంగా తెచ్చిన కలపతో ఫర్నిచర్ తయారు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే, పట్టుకున్న కలప విలువ రూ.88వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డితో పాటు డీఆర్‌ఓలు కవిత, అమర్ సింగ్, ఫారెస్టు ఆఫీసర్లు సజన్, శ్యామ్, డ్రైవర్ సాయికుమార్, బీర్సాయిపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్లు అజయ్, సందీప్‌లున్నారు.

'ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం'

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ దేశవ్యాప్తంగా జరుగుతున్న కుట్ర అని, మిగిలిన కులాలకు ప్రభుత్వం అండగా నిలవలనుకుంటే పది శాతం రిజర్వేషన్‌లను పెంచాల్సింది పోయి.. తమకు అన్యాయం చేస్తోందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. యూపీ వంటి రాష్ట్రంలోనూ బీజేపీకి దారుణమైన ఫలితాలు వచ్చినందునే ఎస్సీ వర్గీకరణకు తెర లేపిందని ఆరోపించారు. ఐక్యంగా ఉన్న దళితులను విభజించే ప్రయత్నాల్లో ఇదొకటని, ఈ విషయాన్ని గమనించాల్సిన అవసరముందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు కావడం లేదని, తెలుగు రాష్ట్రాల్లోను అత్యవసరంగా అమలు చేయడం వెనక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాలు దిగి వచ్చే వరకు పోరాటాలు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న నేతలు

సిండికేట్.. దందా

(5వ పేజీ తరువాయి...)

ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తుంది. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 3 మద్యం షాపులను ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వుడు చేయగా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని తెలుస్తుంది.

ఆచితూచి అడుగులు

ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచడంతో లిక్కర్ వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు ఆచితూచిగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. అదృష్టం కలిసి వస్తే మద్యం షాపు దక్కే అవకాశం ఉంది. లేకపోతే రూ.3 లక్షలు గల్లంతు కానున్నాయి. దీంతో ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. గతంలో 5 నుంచి 10షాపులకు టెండర్లు వేసిన వ్యాపారులు ప్రస్తుతం నాలుగైదు దరఖాస్తులతోనే సరిపెట్టుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి దరఖాస్తులు చేస్తున్నారు. గ్రూపులో ఎవరి పేరిట మద్యం షాపు వచ్చినా అందరూ కలిసి సమానంగా వాటాలు పంచుకునే విధంగా ఒప్పందం చేసుకుంటున్నారు. గ్రూపులో 10 నుంచి 30 మంది వరకు ఉండే విధంగా జాగ్రత్త పడుతున్నారు. ఒప్పంద పత్రం పై వ్యాపారులు ముందు జాగ్రత్తగా సంతకాలు తీసుకుంటున్నారు.

చివరి రెండు రోజులే కీలకం

మద్యం షాపులకు దరఖాస్తు చేసేందుకు మరో నాలుగు రోజుల గడువు సమయమే మిగిలి ఉంది. చివరి రెండు రోజుల్లోనే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఎందుకంటే సిండికేటుగా ఏర్పడుతున్న వ్యాపారులంతా తలోకొంత నగదును జమ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కొక్కరి నుంచి రూ.75 వేలను సేకరించి నలుగురికి ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తున్నారు. జమ చేసిన డబ్బులతో డీడీలు తీసి టెండర్‌లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపుగా ఒకటి రెండు రోజుల్లోనే ఫైనల్ చేసి చివరి రెండు రోజుల్లో భారీగా దరఖాస్తులు వేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని షాపు నెంబర్ 8కి అత్యధికంగా 9 దరఖాస్తులు రాగా.. ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 17 మద్యం షాపులకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఇంకా నాలుగు రోజుల గడువు సమయం మాత్రమే మిగిలి ఉండడం తో ఎక్సైజ్ శాఖ అధికారులు వేచిచూసే ధోరణితో కనిపిస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం దరఖాస్తుల టార్గెట్‌ను పూర్తి చేయాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుంది.

చిట్టీల పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

బజార్‌హత్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బోథ్ సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై సంజయ్ కుమార్‌ల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల రాజు అనే వ్యక్తి బాధితుల దగ్గరి నుంచి చిట్టీలు కట్టించుకుని రూ.15 లక్షలు తిరిగి చెల్లించలేదని ప్రకటనలో తెలిపారు. చిట్టీల పేరుతో మోసానికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మైనర్‌పై అత్యాచార యత్నం కేసులో రిమాండ్

బజార్‌హత్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం కేసులో వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సంజయ్ కుమార్‌లు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన చందన గిరి కిష్టయ్య అనే వ్యక్తి బాలిక(9)పై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడన్నారు. ఈ మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరు పిల్లలకు గాయాలు

జైనత్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోరజ్ మండలం పెండలవాడ గ్రామంలో కుక్కల బెడద రోజు రోజుకి ఎక్కువవుతోంది. కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గ్రామాలలో మేకలు, గొర్రెల పై దాడులు పరిపాటిగా మారాయి. మంగళవారం గ్రామంలో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు ట్రాపే చరణ్, టాప్రే కార్తిక్‌లను వీధి కుక్కలు గాయపరిచాయి. గ్రామస్థులు వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక హాస్పిటల్‌కి తరలించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు

» వీసీలో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల పరిస్థితులపై మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉపముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ఉన్న సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. విద్యార్థుల విద్యాబోధనలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా చూడాలని, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలతో సమన్వయం కలిగి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు. దీంతో వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించనున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఈవో భోజన్న, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులు దయానంద్, అంబాజీ, మోహన్ సింగ్ పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

నిర్మల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూ భారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా భూభారతి, సాదాబైనామా, జనన-మరణ ధ్రువపత్రాలు, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, ఎలక్షన్ ఫారమ్ పెండెన్సీలు, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, కాళేశ్వరం ప్రాజెక్టు 28వ ప్యాకేజీ, సదర్మాట్ బ్యారేజీ భూసేకరణ, ఇసుక అక్రమ రవాణా వంటిఅంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ భారతి దరఖాస్తులను వారానికొకసారి సమీక్షించి వేగంగా పరిష్కరించాలని, ప్రజలు సమర్పించిన దరఖాస్తులు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా చూడాలని ఆదేశించారు. మండలాల వారీగా ఉన్న పెండింగ్ దరఖాస్తులు, ఇప్పటి వరకు పరిష్కరించిన కేసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి వ్యవస్థలో సాంకేతిక సమస్యల వలన జాప్యం జరిగితే తక్షణమే సాంకేతిక సహాయం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, సంబంధిత అర్జీదారులకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగంగా ఫైనల్ చేయాలని ఆదేశించారు. అనంతరం భారీ వర్షాలు, వరదలువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక విపత్తు సహాయక కిట్లను కలెక్టర్ తహసీల్దార్లకు అందజేశారు. ఈ కిట్లలో అవసరమైన వస్తువులు, రక్షణ సామగ్రి, తక్షణ సహాయ సామాగ్రి ఉన్నాయి. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సాంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, తహసీల్దార్లు ఉన్నారు.



బాసర నుంచి పాదయాత్ర నిర్వహిస్తున్న రైతులు



బాసర ఆలయంలో పూజ నిర్వహిస్తున్న రైతులు

రోడ్డెక్కిన రైతులు

పంట నష్ట పరిహారం, సోయా కొనుగోలు కేంద్రాల కోసం

» రైతుల నిరసన ర్యాలీ

» బాసర నుంచి భైంసా వరకు పాదయాత్ర

బాసర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలతో జరిగిన పంట నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో రైతులు రెడ్డెక్కి ఆందోళన బాటపట్టారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీకేఎస్ ఆధ్వర్యంలో బాసర నుంచి భైంసా వరకు రైతులు పాదయాత్ర చేపట్టారు. వరద తమ సమస్యల పరిష్కారం కోసం భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆధ్వర్యంలో రైతులు ఆందోళన బాటపట్టారు. ఇటీవల వచ్చిన వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, అలాగే సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీకేఎస్ ఆధ్వర్యంలో బాసర నుంచి భైంసా వరకు రైతులు పాదయాత్ర చేపట్టారు. బాసర సరస్సు ఆలయంలో పూజలు చేస్తూ నిరసన తెలిపారు. గత నెలలో సంభవించిన వరదల కారణంగా వేల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట కోసి నెల రోజులు గుడిచినా ఇంతరకు సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చయక పోవడంపై రైతులు మండిపడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కేవలం సర్వేలు నిర్వహించారని, ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వనిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ ర్యాలీ చేపట్టామని బీకేఎస్ నాయకులు తెలిపారు. బాసర నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర మంగళవారం రాత్రి ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయంలో బస చేయనుంది. బుధవారం భైంసా సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు రైతులు నిరసన వ్యక్తం చేయనున్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ సంకేత్‌కుమార్‌కు బీకేఎస్ రైతులు వినతిపత్రం అందజేయనున్నారు.

ముథోల్‌కు చేరిన రైతు పాదయాత్ర

ముథోల్: ప్రభుత్వం సోయాకొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ముథోల్‌కు చేరుకుంది. కిసాన్ సంఘ్ ప్రతినిధులు మాట్లాడుతూ భారీవర్షాలకు సుమారు 15 వేల ఎకరాలు నీటిలో మునిగిపోయి రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. సోయా పంట ఇంటికి వచ్చిన ఇప్పటి వరకు సోయా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రైతులు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

కళాశాలలో అవగాహన సదస్సు

లోకేశ్వరం, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేజీబీవీ లోకేశ్వరం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంపాక్ట్ ట్రైనర్ వాడేకర్ లక్ష్మణ్, ఆనందిత ఫౌండేషన్ చైర్మన్, నిర్మల్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా గాయకుడు తోట లక్ష్మణ్ తన పాట ద్వారా విద్యార్థులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతమ్, కేజీబీవీ ఎస్‌వో అనసూయ, వినోద్, వెంకటేష్, ఉపాధ్యాయులున్నారు.

'నర్సింగ రావు సేవలు మరువలేనివి'

ఖానాపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దివంగత ఉప ముఖ్యమంత్రి జేవీ నర్సింగరావు రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఖానాపూర్‌లో జేవీ నర్సింగ రావు జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు సంబంధించిన జెంటిల్మెన్ అగ్రిమెంట్‌లో తెలంగాణ తరఫున సంతకం చేసిన ప్రముఖులలో నర్సింగ్‌రావు ఒకరన్నారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉండే దని వక్తలు గుర్తుచేసుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన మనుమడు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, శంకర్, అరుణ్, లక్ష్మీపతి గౌడ్, ప్రసాద్ తదితరులున్నారు.

ఆ డబ్బులు ఆలయానికే చెందాలి

» బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపేవిలాస్

సారంగాపూర్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చి పోయే భక్తులు ఆలయ హుండీల్లో వేసిన కానుకలు, డబ్బులు ఆలయానికే అప్పజెప్పాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపేవిలాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలు, హుండీ డబ్బుల నుంచి రూ.కోటి 58లక్షల అక్రమంగా ఆలయ సి బ్బంది కాంట్రాక్టర్‌కు అప్పజెప్పిన డబ్బులను ఆలయానికి ఇవ్వాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కాల్వ నరేష్ సాయబ్‌రావు, పతని నర్సయ్య చెన్న రాజేశ్వర్, వీరయ్య బీమలింగంతోపాటు నాయకులు ఉన్నారు.

వసతి గృహం నుంచి బాలిక అదృశ్యం

మామడ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఒక వసతి గృహం నుంచి మంగళవారం మధ్యాహ్నం సమయంలో లక్ష్మణ్ చందా మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. విషయం తెలుసుకున్న వసతి గృహం స్పెషల్ ఆఫీసర్ తోటి విద్యార్థినులను ఆరా తీయగా అనారోగ్య సమస్యతో గదిలోవిశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. సాయంత్రం అయినా బాలిక బయటకు రాకపోవడంతో హాస్టల్ సిబ్బంది గాలించారు. ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం రాత్రి మామడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మామడ పోలీసులు తెలిపారు.

సీపీఆర్‌పై వైద్యాధికారులకు శిక్షణ




మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్

నిర్మల్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం సీపీఆర్‌పై వైద్యాధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో చేసే ప్రాణ రక్షణ పద్ధతి అని ఎవరైనా ఒక వ్యక్తి శ్వాస ఆగిపోవడం లేదా హృదయం కొట్టుకోవడం ఆగిపోతే వెంటనే సీపీఆర్ ప్రారంభిస్తే వారి జీవితం తిరిగి ఇవ్వగల అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని తెలియజేశారు. ఇది కేవలం వైద్యులు లేదా నర్సులే చేయాల్సిన పని కాదు సాధారణ ప్రజలు కూడా ఈ పద్ధతిని నేర్చుకోవాలని ఎందుకంటే ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణం కాపాడటానికి సీపీఆర్ చేయడం నేర్చుకోవాలి. ఇది చాలా సులభమైనదని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ సీపీఆర్ కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి 17 వరకు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ ఆశిష్ రెడ్డి, డాక్టర్ రాజా రమేష్, డాక్టర్ సౌమ్య, జిల్లాలోని వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కుల అందజేత

ముథోల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బాధిత రైతు కుటుంబ సభ్యులకు బీమా చెక్కులను అందజేశారు. మండల కేంద్రంలోని తరోడా గ్రామానికి చెందిన దత్తు, బోరిగాం గ్రామానికి చెందిన జాజికర్ బాబులు పీఏసీఎస్ బ్యాంక్‌లో పంట రుణాలు పొందగా.. ఆ సమయంలో రూ.803తో ఎల్ఐసీ బీమా చేశారు. ఆ బీమా కింద ఒక్కొక్కరికి మంజూరైన రూ.2లక్షల చెక్కులను మంగళవారం బాధిత రైతు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, డైరెక్టర్ సుదర్శన్, అరుగుల లక్ష్మీ, సీఈవో సాయరెడ్డి, బ్యాంక్ మేనేజర్ రిచారాణి, సూపర్‌వైజర్ సాయి కుమార్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



పెంచికల్‌పాడ్‌లో ఇంటి పనులను పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్‌పీవో

కుంటాల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల ను వేగవంతంగా పూర్తి చేయాలని డీపీవో శ్రీనివాస్, డీఎల్‌పీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని విట్టాపూర్, పెంచికల్‌పాడ్, కుం టాల గ్రామాల్లో ఇంటి నిర్మాణం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటినిర్మాణం పూర్తయిన వెంటవెంట నే ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం కుంటాల హైస్కూల్, ఆదర్శ పాఠశాల, ఓలా పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రహీం, ఎంపీడీవో వనజ, ప్రిన్సిపాళ్లు రాజు ఉన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్

కుంటాల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : కుంటాల ఆదర్శ మోడల్ పాఠశాలలో గల హాస్టల్‌ను తహసీల్దార్ కమల్‌సింగ్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే బియ్యాన్ని పరిశీలించారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వార్డెన్‌కు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థిని, విద్యార్థులకు అన్నివసతులను కల్పించేందుకు సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధే లక్ష్యం

గురుచరణ్, ఐకేపీ ఏపీఎం, ముథోల్

ఫేస్‌టుఫేస్



ప్రశ్న: మనమండలంలో ఎన్ని స్వయం సహాయక సంఘాలున్నాయి?ఎంతమంది సభ్యులున్నారు?

జవాబు:ముథోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 804 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.ఇందులో 8,040మంది అభ్యర్థులు ఉన్నారు.

ప్ర: సభ్యులకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ కింద ఇప్పటి వరకు ఎన్ని రుణాలు ఇచ్చారు..?

జ: మండలంలో మూడున్నర కోట్లకు గాను ఇప్పటి వరకు రెండు కోట్ల 20 లక్షల రూపాయలను 20 గ్రామ సమైక్య సంఘాలకు ఇవ్వడం జరిగింది. అలాగే బ్యాంక్ రుణాలను రూ. 37 కోట్ల టార్గెట్‌కు గాను ఇప్పటి వరకు రూ. 20 కోట్ల 2 లక్షల 132 గ్రామైక్య సంఘాలకు ఇవ్వడం జరిగింది. గ్రామైక్య సంఘం నిధి నుంచి 25 వీవోఏలకు రూ. 35 లక్షలు వ్యక్తిగత జీవనోపాదుల కోసం రుణాలు ఇవ్వడం జరిగింది.

ప్ర: సంఘాల బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

జ: స్వయం సహాయక సంఘాల బలోపేతానికి పుస్తక నిర్వహణతో పాటు వ్యక్తిగత జీవనోపాధిలో అధిక లాభాలు పొందేందుకు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నాం. తగు రీతిలో సలహా సూచనలను అందిస్తున్నాం. గ్రామ సంఘాల అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలన్న సదుద్దేశమే ఐకేపీ ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగానే ప్రతి మహిళ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఆర్థికంగా మరింత ముందుకు పోవాలన్నదే ఐకేపీ అభిమతం.

-ముథోల్, ఆంధ్రజ్యోతి

రాకపోకలకు తిప్పలే...!



మూలమలుపు వద్ద కంకర తేలి ఏర్పడిన గుంత

బజార్ హత్నూర్,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాతర్ల - కొత్తగూడ రహదారులు పూర్తిగా గుంతల మయమై రాకపోకలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతర్ల నుంచి ఆందుగూడ మీదుగా కొత్తగూడ వరకు గతంలో వేసిన బీటీ రోడ్డుపై కంకర తేలి అడుగడుగున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలతో రోడ్డు కుంగిపోయి వాహనాలు ముందుకు కదల్లేవు. దీంతో ఇటువైపున ఉన్న కొత్తగూడ, చింతకర్ర, ఆందుగూడ గ్రామ స్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాల రోడ్డు బాగుచేయాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



అందుగూడ రోడ్డుపై ఏర్పడిన గుంత

ఏడీసీసీ సీఈఓగా సూర్యప్రకాష్

బోథ్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): బోథ్ ముద్దుబిడ్డ సూర్యప్రకాష్ అంచెలు అంచెలుగా ఎదుగుతు ఇప్పుడు ఆదిలాబాద్ జిల్లా కో ఆపరేటివ్ సహకార బ్యాంక్ సీఈఓగా పదోన్నతి పొందిన శుభ సందర్భంగా కాంగ్రెస్ బోథ్ బ్లాక్ ఆత్మచైర్మన్ గొర్లరాజుయాదవ్, ఆత్మడైరెక్టర్ అబూద్, కాంగ్రెస్ పార్టీ మాజీ బ్లాక్ అధ్యక్షులు మెరుగు నర్సింహాదాస్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలుపడం జరిగింది.

అల్లుకున్న నిర్లక్ష్యం..

● పొంచి ఉన్న ప్రమాదం



నేరడిగొండ, సావర్గాంలో స్తంభానికి ..

నేరడిగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు సావర్గం తదితర గ్రామాల్లో విద్యుత్ వైర్లు, స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. పలు చోట్ల ట్రాన్స్ ఫార్మర్‌తో పాటు స్తంభాలు, వైర్లను చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు చుట్టేశాయి. కరెంటు తీగలను అల్లుకున్నాయి.విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరుగ వచ్చని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాల్సిన విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకునిరెత్తిన విధంగా వ్యహరించడంపై ప్రజలుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- విద్యార్థులకు నిర్ణీత లక్ష్యం తప్పనిసరి
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



మధ్యాహ్నం భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సాపూర్(జి), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. దీనిని మరింత బలోపేతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశా లను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పాఠశాల పరిస్థితు లను, విద్యాబోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రవీంద్ర కుమార్ కలెక్టర్‌కు పాఠశాల వివరాలను తెలియజేశారు. కలెక్టర్ తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు యూనిఫామ్స్, నోట్ బుక్కులు, పాఠ్యపుస్తకాలు అందుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి గదిని సందర్శించి, ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్‌పై సమీక్ష నిర్వహించారు. జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పాఠ్యాంశాలపై విద్యార్థులనుప్రశ్నించారు. బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలపై భయపడకుండా స్పష్టమైన లక్ష్యంతో ముం దుకు సాగాలని ప్రోత్సహించారు.

మౌలిక వసతులపై కలెక్టర్ ఆగ్రహం

పాఠశాలలోని మౌలిక వసతుల నిర్వహణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ క్రాంతిని, ఎంపీడీవో పుష్పలతలను మందలించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఇతర అధి కా రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన

అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారంనాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించాలనే ఉద్దేశ్యంతో జిల్లా స్థాయి అధికారులు విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో కింద కూర్చొని మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థిని నల్లోల్ల ప్లక్ష, కస్తూర్బా గాంధీ విద్యాలయం బాలికల హాస్టల్‌లో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నప్పటికీ జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చి స్వయంగా వేసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందించింది. ప్లక్ష ప్రతిభను కలెక్టర్ అభినందించారు.

గుస్సాడీలను తీసుకువస్తూ.. పరలోకానికి

- గుండె పోటుతో వాహన డ్రైవర్ కన్నుమూత



డ్రైవర్ పోసెట్టి

బోథ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుసాడిలను తీసుకువెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో వాహన డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆదివాసీలు మహారాష్ట్రలోని మాహూర్ పుణ్యక్షేత్రం వద్ద వారి ఆరాధ్య దైవం చెంత పూజలు చేశారు. గుస్సాడీ వేషాలు వేసుకొని మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే తిరుగు ప్రయాణంలో ఐచర్ వాహనాన్ని నడిపిస్తున్న డ్రైవర్ పోసెట్టి గుండెపోటుకు గురై మృతి చెందాడు. స్టీరింగ్ పైనే పడిపోతున్న విషయాన్ని గమనించిన పక్కన ఉన్న ప్రయాణికుడు బ్రేకు వేసి స్టీరింగు తిప్పడంతో వాహనం రోడ్డు పక్కనే నిలిచిపోయింది. దీంతో పెద్ద ప్రాణాపాయం తప్పిపోయిందని వాహనంలో ప్రయాణిస్తున్న వారు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. డ్రైవర్ మృతదేహం మాహూర్లోని ఆస్పత్రిలో ఉన్నట్లు తెలిపారు.

జోరుగా ఇసుక దందా

- ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ. ఆరువేలు

ఆదిలాబాద్(తాంసి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇసుక దందా పిరం వ్యాపారమైంది. మొన్నటి వరకు ట్రిప్పు మూడు వేలు ఉన్న ఇసుక ప్రస్తుతం రూ. 6 వేల వరకు పలుకుతోంది. కేవలం కి.మీ. దూరంలోనే ఈ దోపిడీ ఆగట్లేదు. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదు. తాంసీ మండలంలోని తాంసి, వడ్డాడి, హసనాపూర్, కప్పర్ల, మండల నాగపూర్, గొట్కూరి గ్రామాలలో నిత్యం లక్షల రూపాయల ఇసుక దందా నడుస్తూనే ఉంది. ఈ విషయాన్ని పట్టించుకోకుండా ఉండటానికి అధికారులు మాముళ్లు తీసుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఒక్క ట్రాక్టర్ ఇసుక నింపిన కూలీలకు వెయ్యి రూపాయలు మాత్రమే యాజమానులు చెల్లిస్తున్నారు.

కేవలం కిలోమీటర్ దూరంలో ఈ ఇసుక రవాణా చేయడంతో సంబంధిత ట్రాక్టర్ యజమానికి రూ. ఐదు వేలు లాభం వస్తుంది. వాస్తవానికి ప్రభుత్వ ఆదేశాల అనుసారం రూ. 450 నుంచి ఐదు వందలకే విక్రయించాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడంలేదని పలువురు లబ్ది దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాక్షాత్తు అంతర్ రాష్ట్ర రహదారి పక్కనే ఇసుక రవాణా చేస్తున్న ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెంటనే అధికార యంత్రాంగం స్పందించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.



ఐటీడీఏ ఎదుట నిరసన తెలుపుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఐటీడీఏ ఎదుట రెండో రోజుకు చేరిన 72గంటల నిరసన

ఉట్నూర్,అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పాఠశాలల్లో పని చేస్తున్న డైలీవేజ్ , ఔట్ సోర్సింగ్ వర్కర్లు చేపట్టిన 72గంటల నిరసన మంగళవారంకు రెండో రోజుకు చేరింది. ఉట్నూర్ మండల బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చేపడుతున్నటు వంటి సమ్మె 33వ రోజుకు చేరుకున్న సందర్భంగా యూనియన్ జేఏసీ పిలుపు మేరకు 72 గంటల నిరసన కార్యక్రమం సమగ్ర గిరిజనాభి వృద్ధి సంస్థ పీవో కార్యాలయాల ముందు నిర్వహిస్తున్నారు.

పిప్పల్కోటిలో ఓట్ చోరీ కార్యక్రమం

భీంపూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పిప్పల్ కోటిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి రమేష్, రేణుకుంట్ల శ్రీనివాస్‌లు ఓట్ చోరీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీజేపీ పార్టీ ఓట్ చోరీతోనే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు వివరించి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో రెండ్లగోవర్ధన్, జటాల విఠల్, అనిల్, ఖాసిం, రవి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో బోథ్ ఎమ్మెల్యే

బోథ్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్అనిల్ మంగళవారం పాల్గొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పలు మండలాల నాయకులను వెంట వేసుకుని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

చాక్‌పల్లి రైతన్నకు వాన కన్నీరు



చాక్‌పల్లిలో ట్రాక్టర్‌కు అమర్చిన నూర్పిడి యంత్రం

నర్సాపూర్(జి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ అకాల వర్షాల కారణంగా మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట కోసి, నూర్పిడి చేసే సమయానికి పొలాల్లో బురద పేరుకుపోవడంతో హార్వెస్టర్లు లోపలికి వెళ్లడం లేదు. దీంతో నూర్పిడి భారం రెట్టింపై రైతన్నలు కన్నీరు పెట్టుకుంటున్నారు.

చాక్‌పల్లి రైతు వకీల్ కష్టాలు

చాక్‌పల్లి గ్రామానికి చెందిన రైతువకీల్ పరిస్థితి దీనికి నిదర్శనం. యంత్రాలు రాకపోవ డంతో ఆయన కూలీలను ఆశ్రయించక తప్ప లేదు.

పెరిగినఖర్చు: నేల కొరిగిన కంకులను కోసి, నూర్పిడి యం త్రానికి వేయడానికి ముగ్గురు కూలీలకు రోజుకు రూ.1,800 (రూ.600ల చొప్పున)చెల్లించాల్సి వస్తోంది.

యంత్రం అద్దె భారం...

క్వింటాల్‌కు రూ.150 చొప్పున నూర్పిడి యంత్రం అద్దె కూడా అదనపు భారంగా మారింది. పంట దిగుబడి తగ్గింది. నూర్పిడి ఖర్చు పెరిగింది. మళ్లీ అప్పులు చేయక తప్పదని వకీల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ధర కోత, తేమ సమస్య

మరోవైపు ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకెళ్లిన అధిక తేమ శాతం కారణంగా వ్యాపారులు మద్దతు ధర (రూ. 1,800-2,000) ఇవ్వకుండా కేవలం రూ.1,400-1,500లకే కొనుగోలు చేస్తున్నారు. ధర తగ్గింపు వల్ల రైతులకు నష్టం మరింత పెరుగుతోంది.

ప్రభుత్వానికి ఆర్తి

కోతల సమయంలో అధిక ఖర్చు, తక్కువ ధరలతో నష్టపోతున్న తమను ఆదుకోవాలని చాక్‌పల్లి రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తక్షణమే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, తేమ శాతంలో సడలింపు (14 శాతం బదులు 20 శాతం వరకు) ఇవ్వాలని, నష్టపోయిన ప్రతి ఒకరాకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో రైతు కుటుంబాన్ని కాపాడటం కష్టమవుతుందని ఆర్తిగా కోరుతున్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

బజార్ హత్నూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపూర్, మాంజరం తాండా, టెంబి, హర్కాయి గ్రామ శివారుల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం కురవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. చేతికి వచ్చిన సోయపంట నీట మునుగుతుందని ఆవేదన చెందారు. కాగా ఎగువ భాగాన ఉన్న బజార్ హత్నూర్, జాతర్ల చందునాయక్ తాండా గ్రామాల్లో వర్షం కురవకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

డ్రైవర్లూ... జాగ్రత్త..

బోథ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు జాగ్రత్తలను తీసుకోవాలని ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్‌వైద్య, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అల్లకొండ పోతన పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోమానం లక్ష్మీవెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో డాడీస్ రోడ్డు క్యూఆర్ స్టిక్కర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టిక్కర్లు తొమ్మిది రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. ప్రమాద సందేశం రక్త నిధి పార్కింగ్ సమస్య పత్రాలు భద్రపరచడం రిమైండర్ లాక్ వాహన హెచ్చరిక క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.

నూతన ఐఎంఏ కార్యవర్గానికి సత్కారం

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్),అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):నూతనంగా ఎంపికైన ఐఎంఏ కార్యవర్గాన్నీ జిల్లాకేంద్రంలోని రిమ్స్ లో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి సమితి సభ్యులతో కలిసి సన్మానించారు. డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ తోపాటు సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఐఎంఏ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ సతీష్ కాలే, డాక్టర్ కళ్లెం వెంకట్‌రెడ్డితోపాటు డాక్టర్ దీపక్,డాక్టర్ సాయికృష్ణసహకార్యదర్శికోశాధికారులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్ర.ధాన కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, నర్సోజీ పాల్గొన్నారు.

పాత నేరస్తులు నేరాల్లో పాల్గొంటే పీడీయాక్ట్



పాత నేరస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇమ్రాన్

నేరడిగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గల 30మంది గతంలో గంజాయి,మట్కా, పేకాట,దొంగతనం. అక్రమ మద్యం, లాటరీ కేసుల్లోఉండి వారిప్రవర్తన మార్చుకోక పోలీస్‌స్టేషన్లో షీట్లు నమోదైన వారిని మంగళవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారి కి అవగాహనకల్పించారు.ఈసందర్భంగా ఎస్సై ఇమ్రాన్ మాట్లాడుతూ..భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడ కుండా ఉండాలని అన్నారు.వారి వద్దసత్ప్రవర్తనతో ఉండేందుకు హామీ తీసుకోవ డము జరిగిందన్నారు. నేరాలకు పాల్పడి నట్లయితే వారు తప్పనిసరిగా జైలుకు వెళ్లవలసి ఉంటుంది. లేని పక్షంలో నేరాలు మానుకోలేమని అనుకునే వారు ఖచ్చితంగా ఊరువదిలిపెట్టి పోవాల్సి ఉంటుం దన్నారు. అంతే కాకుండా ఒకసారి నేరాల్లో పాల్గొని రెండోసారి తిరిగి అదే నేరాల్లో పాల్గొంటూ ఉంటే అటువంటి వారి విషయంలో ఖచ్చితంగా నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడము జరుగుతుందని అన్నారు.ఇప్పటికే మండలంలో గతంలో పలునేరాలకు పాల్పడిన కొంతమందిని గుర్తించి వారిని హెచ్చరించడం జరిగిందని అన్నారు.ఇందులో సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడలో బాలీవుడ్ సినిమా



షూటింగ్‌లో పాల్గొన్న హీరో, హీరోయిన్

బాన్సువాడటౌన్ , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. వాంపైర్ సాగ అనే బాలీవుడ్ సినిమాను దర్శకుడు జుబర్ కె.ఖాన్ తెరకెక్కించనున్నారు. ఈ మేరకు పాతబాన్సువాడలో షూటింగ్ కొనసాగింది. గతంలో హిట్టయిన ఫిదా సినిమా కూడా బాన్సువాడలోనే షూటింగ్ జరగడం విశేషం.

విత్తన క్షేత్రంలో మయూర సోయగాలు



విత్తన క్షేత్రంలో కనువిందు చేస్తున్న నెమళ్లు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్తుమ్మెద ప్రభుత్వ విత్తన క్షేత్రం భూముల్లో మయూరాలు విహరిస్తూ మంగళవారం కనువిందు చేశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎటుచూసినా ప్రకృతి పచ్చదనంగా మారింది. దీంతో అడవుల్లో ఉండాల్సిన నెమళ్లు బయట కనిపిస్తున్నాయి. విత్తన క్షేత్రం భూముల్లో గుంపులుగా తిరుగుతూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ, హాయిగా విహరిస్తూ కనువిందు చేస్తున్నాయి. పురివిప్పి నాట్యం ఆడుతున్నాయి. ఈ అందమైన నెమళ్లను ఆ వైపుగా వెళ్తున్న వాహనదారులు ఆగి మరీ ఈ అందాలను చూసి ఫోన్లలో చిత్రాలు తీసుకుంటున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కల తొలగింపును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

నిర్మల్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గుల్జార్ మస్జీద్ అనుబంధ ఖబరస్తాన్‌లో మంగళవారం పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టారు.స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ తౌహీద్ ఉద్దీన్ చొరవతోమున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు దేవిదాస్, ప్రవీణ్ అక్కడకు చేరుకుని పనులను పర్యవేక్షించారు. వర్షాకాలం కావడంతో మొక్కలు, పొదలు పెరిగి విషప్రాణుల సంచారానికి అనువుగా మారి, తద్వారా అక్కడికి వచ్చే వారికి ప్రమాదకరంగా మారడంతో వాటిని తొలగింప జేశారు. పరిశుభ్రత ప్రాముఖ్యతను గుర్తించి అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు స్థానికులు అభినందించారు.

చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు
- నేడు వరల్డ్ హ్యాండ్ వాష్‌డే



చేతులు శుభ్రం చేసుకుంటున్న బాలికలు

ముథోల్,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీఏటా అక్టోబరు 15న ప్రపంచ హ్యాండ్ వాషింగ్ డేను ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటారు. నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య శాఖలు ఈ సంద ర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు చేతులు సరిగ్గా కడుక్కోవడంపై ప్రదర్శ నలు చేయడం, చిన్న పిల్లల్లో ఈ అలవాటు పెంపొందించేందుకు పాటలు, పోస్టర్లు, ర్యాలీలతో అవ గాహన కల్పిస్తారు. ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు 'శుభ్రతే ఆరోగ్యానికి సూచికని. ప్రతి ఒక్క రూ రోజువారీ జీవితంలో చేతులు కడుక్కోవడాన్ని అలవాటు చేసుకుంటే కుటుంబం మొత్తం ఆరోగ్యం గా ఉంటుందని అవగాహన కల్పిస్తున్నారు. మానవ శరీరానికి వ్యాధులు చేర్చే 80 శాతం సూక్ష్మజీవులు చేతుల ద్వారా వస్తాయని పిల్లలకు తెలియజెపుతున్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 15 అక్టోబరు 2025



నేడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమావేశం

నేరడిగొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడి నియామకం కోసం ఏఐసీసీ పీసీసీ పరిశీలకుడు బోథ్ నియోజకవర్గానికి వస్తున్నందున బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోథ్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆశాల సమస్యలకు పరిష్కారం చూపాలి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్‌లు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఆశా యూనియన్ నిర్మాణ మహాసభను నిర్వహించారు. ఆశలకు ఫిక్స్ వేతనం చెల్లించాలని, హక్కుల సాధనకు ఐక్యంగా ఉండి పోరాటాలు జరపాలన్నారు. లింగాల చిన్నన్న, నైతం శోభ, సుజాత, స్వరూప, లక్ష్మీ పాల్గొన్నారు.

సీపీఆర్ ప్రక్రియపై అవగాహన అవసరం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, గుండెపోటు వచ్చిన సమయంలో పది నిమిషాలలోపు సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన అన్నారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో మంగళవారం సీపీఆర్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులకు అర్థమయ్యేలా సీపీఆర్ చేయడాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాధన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ బాధితుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎన్‌సీడీ పీఓ డాక్టర్ శ్రీధర్, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సుమలత పాల్గొన్నారు.

సిండికేట్.. దందా!



● విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లు

మద్యం టెండర్లలో..

వ్యాపారులు సిండికేటు దందాకు పాల్పడుతున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదని తెలుస్తుంది. 2025-27 ఏడాదికి గాను మద్యం షాపులు (ఏ4) ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల ను స్వీకరిస్తుంది. గత నెల 26 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 19 రోజులు గడిచిపోయినా.. దరఖాస్తుల ప్రక్రియ నెమ్మదిగానే సాగుతోంది.

- మద్యం టెండర్లకు దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ టెన్షన్
- రూ.3లక్షలకు పెంచడంతో జంకుతున్న స్థానిక వ్యాపారులు
- మిగిలింది నాలుగు రోజులే.. వేచి చూసే ధోరణితో ఎక్సైజ్ శాఖ
- టార్గెట్‌ను పూర్తి చేయాలంటున్న ఉన్నతాధికారులు

జిల్లాలో 40 మద్యం షాపులకు 58 దరఖాస్తులే..

ఆదిలాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 40 మద్యం షాపులు ఉండగా మంగళవారం సాయంత్రం నాటికి 58 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 40, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 8, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 10 దరఖాస్తులు వచ్చాయి. ఇదే గతేడు 40షాపులకు గాను 150 దరఖాస్తులు రావడంతో రూ.3కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.



మద్యం టెండర్‌కు దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు



గడువు సమయం దగ్గర పడుతున్నా.. దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈనెల 18 సాయంత్రంతో దరఖాస్తుల గడువు సమయం ముగియనుంది.

టార్గెట్ కోసం తంటాలు

గడువు సమయం దగ్గర పడుతున్నా.. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు టెన్షన్ పడుతున్నారు. నిత్యం ఆ శాఖ ఉన్నతాధికారులు దరఖాస్తుల సంఖ్యపై ఆరా తీస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రావడం లేదు. ఇప్పటికే లిక్కర్ వ్యాపారంలో అనుభవం ఉన్న వ్యాపారులను బుజ్జగిస్తూ దరఖాస్తులు వేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో 40 మద్యం షాపులకు గాను 9 షాపులు ఏజెన్సీ పరిధిలోనే ఉన్నాయి. మిగితా 31 మద్యం దుకాణాలకు కూడా అంతంత మాత్రంగానే దరఖాస్తులు వస్తున్నాయి. కొంతమంది వ్యాపారులు దరఖాస్తు చేసేందుకు మంచి

(తరువాయి 6వ పేజీలో....)



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించాలి : కలెక్టర్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగవంతం చేసి బాధితులకు అండగా నిలవాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాల పట్ల తక్షణమే స్పందించి వారికి న్యాయం చేకూర్చాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సమావేశంలో పాల్గొన్న ఆయన... సభ్యుల అభిప్రాయాలను స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లో తమకు సముచిత స్థానం ఇవ్వాలని సభ్యులు కోరగా... అందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ... బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణ చేపట్టాలన్నారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన విచారణ పూర్తి న్యాయం చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల కలెక్టర్‌కు కేంద్ర అవార్డులు రావడంతో కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు శ్యామల దేవి, రాజేశ్వర్, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ సలోని చ్రబ, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ వంశీ కృష్ణ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పురస్కారం అభినందనీయం

ఉట్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవా పురస్కారం (స్టార్ ఈఎంటీ) ఆదిలాబాద్ జిల్లాకు రావడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ 33 జిల్లాల్లో పని చేస్తున్న 108 సిబ్బందికి రాష్ట్ర ఎంఆర్ఐ సంస్థ అందించే ఉత్తమ సేవా పురస్కారంకు మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌లో మెడికల్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న గణేష్ ఎంపిక కావడం హర్షనీయం అన్నారు. జిల్లాకేంద్రంలోని గిరిజన ప్రాంతంలో గణేష్ గత ఆరు నెలలుగా అత్యవసర సేవలు అందించడం, అలాగే బెనిఫిషరీకి ప్రిహాస్పిటల్ కేర్ అందించినందుకు ఆయన సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ సేవ పురస్కారంకు ఎంపిక పట్ల పీవో అభినందిస్తూ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఖుష్బుగుప్తా మాట్లాడుతూ అంకిత భావంతో పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా ఇన్‌చార్జి రాజశేఖర్, పైలెట్ సుందర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



ఈఎంటీ గణేష్‌ను అభినందిస్తున్న పీవో ఖుష్బుగుప్తా

నేటి నుంచి గాలికుంటు టీకాలు

▸ పశువైద్యాధికారి గోవింద్‌నాయక్

ఇచ్చోడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాలల్లో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15న అడేగామ (బి), 16న గుబ్బాతండా 17న అడేగామ(కె), 18న గాంధీనగర్, జున్ని, 19న కామగిరి, 20న బోరిగాం, 21న దేవులనాయక్‌తాండ, 22న ముక్రా (బి), 23న ముక్రా(కె), 24న సాత్‌నంబర్, ఇస్లాంనగర్, 25న కోకస్‌మన్నూర్, 26న జామిడి, 27న గేర్జం, 28న జల్దా, 29న చించోలి, 30న దరంపూరి, 31న నవేగాం, నవంబర్ 1న దుబార్‌పేట్, 2న మాధాపూర్, 3న మేడిగూడ, మాన్కాపూర్, 4న సల్యాద, 5న మల్యాల, యాపల్‌గూడ, 6న గుండి, గుండివాగు, 7న నర్సాపూర్, 8న కేశవపట్నం, 9న గుండాల, 10న బాబ్జీపేట్, 11న సిరిచెల్మ, 12న తలమద్రి, 13న దాబా(బి), 14న దాబా(కె), 15న హిరాపూర్, 16న ఇచ్చోడలో నివారణ టీకాల కార్యక్రమం ఉంటుంది. పాడి రైతులు మీ గ్రామాల్లో టీకాలు రోజు అందుబాటులో ఉండి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేరడిగొండ: మండలంలో నేటి నుంచి గాలికుంటూ వ్యాధి నివారణకు టీకా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 16 వరకు ఆయా గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపడుతున్నందున పశు పోషకులు దగ్గరుండి తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గెస్ట్ లెక్చరర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డీఐఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రెగ్యులర్ అధ్యాపకులకు సమానంగా బోధనలు చేస్తున్నప్పటికీ తమకు తగిన గుర్తింపు లభించడం లేదని వాపోయారు. ఈ మేరకు నిరసన చేపట్టి తమ డిమాండ్లను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. ఈ మేరకు గెస్ట్ లెక్చరర్ పావని కుమారి మాట్లాడుతూ.. రెగ్యులర్ అధ్యాపకులకు సమానంగా బోధనలు చేస్తున్నామని, తమ ఇబ్బందులను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్‌లు ఆశ, వేణు, ఆఫీన్, రిజ్వాన బేగం, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలు

బజార్‌హత్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-17 సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. బజార్‌హత్నూర్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భోజన్న, ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడారు. ఈ పోటీల్లో బజార్‌హత్నూర్‌తో పాటు ఆదిలాబాద్, నేరడిగొండ, ఇచ్చోడ, బోథ్, గుడిహత్నూర్, తదితర మండలాల హైస్కూల్ బాలబాలికలు పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభను ప్రదర్శించి ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళతారని స్పోర్ట్స్ సెక్రటరీ రామేశ్వర్, పీడీ అఖిల్‌లు తెలిపారు. ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, రమేష్, మనోహర్, బాపురావు, సోనేరావులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలిక మృతి



చందన(ఫైల్)

బోథ్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్ధరి గ్రామానికి చెందిన బాలిక చందన(11) జ్వరంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో చందన ఆరో తరగతి చదువుతోంది. చందన దసరా పండుగకు ఇంటికి వచ్చి పాఠశాలకు వెళ్లలేదు. సోమవారం తీవ్రజ్వరంతో రాత్రిపూట మృతి చెందింది. కాగా బాలిక నానమ్మ ఇచ్చోడ మండలంలోని గోధుమల్యాల గ్రామంలో మృతి చెందడంతో తండ్రితో పాటు కుటుంబీకులంతా ఆ గ్రామానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాలికను ఆస్పత్రికి తీసుకు వెళ్లేవారు లేరు. సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

సంప్రదాయబద్ధంగా దండారి సంబురాలు

▸ భోగితో ఆదివాసీ గూడెల్లో ప్రారంభమైన వేడుకలు

బజార్‌హత్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గూడెల్లో మంగళవారం భోగి పూజలతో దండారి సంబరాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని జాతర్ల, మాడగూడ, అనంతపూర్, చింతలసాంగ్వి, రాంపూర్, సర్పంచ్ గూడ, ధరంపూరి గ్రామాల్లో భోగి పూజలతో పండగను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుస్సాడీ వేషధారుల సామగ్రి, వాయిద్యాలకు గ్రామ పటేల్, దేవారి, మహాజన్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలు ఆదివాసీ గూడాల్లో వైభవంగా జరుగనున్నాయి. కాగా ఈ ఉత్సవాల్లో గుస్సాడి వేషధారులు ప్రత్యేక ఆకర్షణగా ఉంటారు. సంప్రదాయం ప్రకారం మిగిలిన గూడవాసులతో కలిసి ఒకరికొకరు ఆతిథ్యమిచ్చిపుచ్చుకుంటారు. అంతేకాకుండా ఈ సంబురాలలో భాగంగానే పెళ్లి సంబంధాలు కుదుర్చుకుంటామని గ్రామ పటేల్ పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి: దండారి.. అంటేనే ఆదివాసీ గూడెల్లో వినోదాల వేడుక. ఏటా ఆదివాసీలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత ఏత్మాసార్ పేన్ పేరిట చేసే ప్రత్యేక పండుగను మంగళవారం ప్రారంభించారు. మండలంలోని తుమ్మగూడ, లక్కుగూడ, తదితర ఆదివాసీ గూడెల్లో సంప్రదాయబద్ధంగా భోగి పండుగ సందర్భంగా ఏత్మాసూర్ పేన్ దేవతలకు భోగి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఏత్మాసూర్ పేన్ దేవతలు ఉన్న ఇంటి ఆవరణలో ఆదివాసీ గిరిజన సంప్రదాయ ప్రకారం దండారీ ఉత్సవాల్లో గుస్సాడీలు ధరించే నెమలి ఈకలతో తయారు చేసిన టోపీలు, ఖోడాంగ్, ఏత్మాసూర్ పేన్ దేవతలు, డోల్, పిప్రే, సన్నాయి, తుడుం, డప్పులు, పాయిలి, తబలా, వివిధ వస్తువులను ఉంచి వాటికి సంప్రదాయం ప్రకారం పురుషులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భోగి పూజల అనంతరం గుస్సాడీలుగా మారే యువకులు ఒకే పల్లెంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, లక్కుగూడ గ్రామ పటేల్ కోరెంగ లక్కు, దేవరి కోరెంగ యశ్వంత్, మహాజన్ ఆత్రం లాల్ దేవ్, తదితరులు పాల్గొన్నారు.



చింతల సాంగ్విలో భోగి పూజలు చేస్తున్న ఆదివాసీ ప్రజలు

సంబురాల్లో మునిగి తేలుతున్న ఆదివాసీలు

ఆదిలాబాద్(సిరికొండ): ఆదివాసీ గిరిజనులు దీపావళి వేడుకల సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించే గుస్సాడి దండారీ ఉత్సవాలు మంగళవారం భోగి వేడుకలతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని పలు ఆదివాసీ గూడాల్లో వారు ఉపయోగించే నెమలి ఈకల టోపీలు, వస్త్రాలు, డప్పు, రడమేళ, డోల్, వెట్టి, కర్ర, పెప్రీ, తుడుం, తదితర గుస్సాడి పరికరాలకు ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా మండలంలోని రిమ్మ, కోసుపటేల్ గూడ, వాయిపేట్, కుంటగూడ, చిన్నగోదుమల్లే, నేరడిగొండ(జి), నారాయణ్ పూర్, కన్నా పూర్, పోచంపల్లి, తదితర గ్రామాల్లో గ్రామ పటేల్ ఆధ్వర్యంలో గ్రామపెద్దలతో కలిసి భోగి పూజలు నిర్వహించి దండారీ ఉత్సవాలను ప్రారంభించారు. ఇందులో గ్రామ పటేళ్ల, దేవరీలు, మహాజన్‌లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



లక్కుగూడలో గ్రామ పటేల్ కోరెంగలకు ప్రత్యేక పూజల దృశ్యం



రిమ్మ గ్రామంలో ఏత్మాసూర్ దేవతకు, గుస్సాడీ పరికరాలకు పూజలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

గంజాయి, గుడుంబాలను నిరోధించాలి

▸ ఉట్నూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్

ఉట్నూర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న ఫ్లాగ్‌డే వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని సంఘ విద్రోహ శక్తులతో పోరాడి అసువులు బాసిన అమరవీరుల జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో మృతి చెందిన కానిస్టేబుల్ శంకర్ స్మారకార్థం నిర్మించిన భవనాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ప్రారంభించారు. కానిస్టేబుల్ శంకర్ 1999లో బోథ్ నందు సంఘ విద్రోహ శక్తులతో పోరాడి అసువులు బాసిన విషయాన్ని ఎస్పీ గుర్తు చేశారు. కానిస్టేబుల్ శంకర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో ఎస్పీ అఖిల్ మహాజన్, ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్ సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కత్తిరించి భవనాన్ని ప్రారంభించారు.





మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్ (ఇన్‌సెట్‌లో కానిస్టేబుల్ శంకర్ స్మారక భవనాన్ని ప్రారంభిస్తూ...)

ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి

ఏజెన్సీ ప్రాంతాల ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఉట్నూర్ సబ్ డివిజనల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మండలాలలో ప్రజలతో రైతులతో సత్సంబంధాలను మెరుగు పరుచుకోవాలని యువతకు ప్రజలకు ఆదివాసీలకు గంజాయి మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాటి వల్ల కలిగే అనర్థాలపై చైతన్యపరచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా, గుడుంబా, పేకాట, మట్కా లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బాధితులు సమర్పించడం ఫిర్యాదుల పట్ల తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బంది విధి విధానాలపై క్షుణంగా సమీక్ష నిర్వహించారు. అదే విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, వాటి స్థితిగతులు, దర్యాప్తు పూర్తి చేసిన కేసుల వివరాలు, ప్రదా ఒక్కదానిపై పరిశీలన చేసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలాలలో ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమార్కుల పాలుకాకుండా పర్యవేక్షించాలని సూచించారు. రాత్రి సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల ప్రమాదాలను అరికట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా డయల్ 100 ద్వారా పెట్రోకార్ ద్వారా సాయంత్రం వేళ గస్తీ నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. బాధితుల ఫిర్యాదుల పట్ల బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ వారి సమస్యలపై సత్వరమే పరిష్కారం లభించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, నార్నూర్ సీఐ పి.ప్రభాకర్, ఎస్సైలు సాయన్న, ప్రవీణ్, అఖిల్, మృతి చెందిన కానిస్టేబుల్ శంకర్ సతీమణి దూరిబాయి, కూతురు నిర్మల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

▸ ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకే సంఘటన్ శ్రుజన్ అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్ అన్నారు. అందరూ కలిసి గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారీ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టి రాహుల్ గాంధీ చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారన్నారు. కాగా పట్టణంలోని గాయత్రి గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారదీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న బిహార్, హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ గత ఎన్నికలలో అబ్ కీ బార్ చార్ సౌ పార్ అన్నారని, కానీ కష్టం మీద 250 సీట్లు దాటాయన్నారు. నల్లధనాన్ని బయటికి తీస్తానని ప్రగల్భాలు పలికి కార్పొరేటర్లకు కోట్ల రుణాలు మాఫీ చేశారన్నారు. అన్నదాతకు మాత్రం రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఇందులో సంఘటన్ శ్రుజన్ అభియాన్ సమన్వయ కర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంభూపాల్, కార్యక్రమ కోఆర్డినేటర్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్